

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## దర్జాగా దేవరగుట్టలోనే

# తిష్ట వేసిన పులి



సోమవారం గుట్ట ఆవరణలోనే దర్జాగా తిరుగుతూ కనిపిస్తున్న పులి

**నవాబుపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** గత పది రోజులుగా మండల పరిధిలోని ఎన్మన్‌గండ్ల గ్రామ శివారులోని దేవరగుట్టలోని దర్జాగా తిష్ట వేసి కూర్చుంది. గత నాలుగైదు రోజులుగా అటవీ అధికారులు దాదాపు 15 మంది సిబ్బందితో అక్కడ మాటు వేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పులిని పట్టుకోవడానికి బోను ఏర్పాటుచేసిన కూడా ఫలితం లేకుండా పోయింది. అటు ఇటు తిరుగుతూ అటవీ అధికారులు వేసిన ఉచ్చులో చిక్కకుండా దేవరగుట్టలోనే రోజు పాదచారులకు గుట్ట చుట్టుముట్టు ఉన్న పంట పొలాల రైతులకు రోజు కనబడుతూనే ఉంది. రెండు రోజులుగా కనిపించకుండా పోయిన పులి తన రూటు ప్లేస్ మార్చి వేరే గుట్టకు పోయిందేమో అనుకున్నారు. సోమవారం గుట్టపై దర్జాగా తిరుగుతూ ప్రజలకు హఠాత్తుగా దేవరగుట్టపై నేనే రాజు నేనే మంత్రి అన్నట్టుగా దర్శనమిచ్చింది. దర్జాగా పెద్ద గుట్టపై ఉన్న పులి,కంటపడి రైతులకు పాదచారులకు గ్రామస్తులకు నిద్ర పట్టకుండా చేస్తుంది. గ్రామ ప్రజలు ఇంకా రెండు బోన్లు తెచ్చి నాలుగు దిక్కుల బోను ఏర్పాటు చేసి త్వరగా పులిని బంధించి తీసుకెళ్లాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మిర్చి రైతులను ఆదుకోవాలి

## అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



రైతులతో కలిసి మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**మానవపాడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** అకాల వర్షానికి నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పొగాకు తడిసి ముద్దయిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు సోమవారం కల్లాల్లో మిర్చి, పొగాకును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షానికి మిర్చి తడిసిపోయిన కల్లాల వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడలేదని రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించకపోవడం ఏంటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అకాల వర్షానికి తడిసిపోయిన మిర్చి రైతులను పొగాకు రైతుల జాబితాను అంచనా వేయాలని ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పరిస్థితిని ఏ మంత్రి కూడా పరిశీలించకపోవడం బాధాకరంగా ఉందని ఎమ్మెల్యే వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఒక ఎకరాకు దాదాపు రూ. 2 లక్షలు నష్టపోయామని రైతులు మరోవైపు మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక కల్లాల్లోనే మిర్చిని ఆరబెట్టుకోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి, పొగాకు రైతులను రైతులను ప్రభుత్వం ఆదుకునే విధంగా చూడాలని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే వెంట రైతులు శ్రీకాంత్ రెడ్డి, గొల్ల వెంకట్రాముడు, శంకరన్న నాయుడు, వడ్డే పరమేష్, భాష బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

## పీయూలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాలమూరు యూనివర్సిటీలో నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. సోమవారం ఒప్పంద అధ్యాపకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు డా. పర్వతాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బడ్జెట్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో బోధిస్తున్న ఒప్పంద అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని, అలా కానిపక్షంలో యూజీసీ పే స్కేల్‌తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని, బోధన పరిశోధనా రంగంలో విశేషా అనుభవం ఉన్న తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూమయ్య శ్రీధర్‌రెడ్డి, అర్జున్ కుమార్, సుదర్శన్ రెడ్డి, గౌస్, డా.ప్రదీప్, ప్రభాకర్ రెడ్డి, ఈశ్వర్ కుమార్, సోమేశ్వర్, విజయభాస్కర్, రవికుమార్, కరుణాకర్ రెడ్డి, రవికాంత్ పాల్గొన్నారు.

# భూభారతి చట్టం

# రైతులకు చుట్టం..

## సకల సమస్యలకు పరిష్కారం : ఎంపీ మల్లు రవి

**అలంపూర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** భూ భారతి చట్టం రైతులకు చుట్టంలా సకల సమస్యలకు పరిష్కార వేదికగా ఉంటుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. సోమవారం ఆలంపూర్ లోని బి.ఆర్.ఎస్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం 2025 పై అవగాహన సదస్సు కార్యక్రమంలో అలంపూర్ శాసన సభ్యులు విజయుడు, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ తో కలిసి పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురి అనుమానాలు, సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. రైతుల పక్షపాతిగా, వారి సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్య మంత్రి భూభారతి చట్టం అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో రైతులు ధరణి పోర్టల్ ద్వారా చాలా ఇబ్బందులు అనుభవించారని, కార్యాలయాల చుట్టు కాళ్లు అరిగేలా తిరిగారని, అధికారులు కూడా నిస్సాయులుగా ఉండిపోయారని అన్నారు.ఈ దుస్థితిని మారుస్తూ, పేద రైతుల కన్నీళ్లను తుడిచే ఉద్దేశంతో డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ జయంతి నాడు భూభారతి చట్టాన్ని ప్రారంభించామన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ రైతులకు న్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వం అన్ని కోణాలలో, మేధోమథనం చేసిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ప్రతి వారం కలెక్టర్,తహాశీల్దార్ సహా సంబంధిత అధికారులతో సమీక్షలు జరిపి భూ సమస్యలపరిష్కారంపై స్వయంగా పర్యవేక్షణ చేస్తానని ఎంపీ తెలిపారు. గత ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేశారని,వారు చేసిన భాకీలకు అసలు, వడ్డీలు కడుతూనే.. ఇన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని అన్నారు. రైతులు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని,రైతు భరోసా ఇస్తున్నామని,సన్నాలకు రూ. 500 బోనస్,ఇందిరమ్మ ఇండ్లు,రూ. 500 సిలిండర్ రాయితీ,200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,40 శాతం మెస్ చార్జీలు పెంపు, సమీకృత గురుకుల పాఠశాలలు, రేషన్ షాపు ద్వారా పేదలకు సన్న బియ్యం,పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీ,రాజీవ్ ఆరోగ్య శ్రీ 10 లక్షలు, రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు,ఇలా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు.ఈ విధంగా ప్రభుత్వం రైతుల, పేదల, మహిళల,యువత కోసమే కట్టుబడి పనిచేస్తోందని,ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.



అవగాహన సదస్సు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి మల్లురవి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూమి వివాదాలను పరిష్కరించి, భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూములకు సంబంధించి సర్వే చేసి, హద్దులు, కొలతలు, భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా భూధార్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. సాదా బైనామాల పరిష్కారం వేగవంతమవడంతో పాటు, వారసత్వ మ్యూటేషన్, హక్కుల సంక్రమణను గడువులో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహాసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూభారతి ద్వారా భూమికి సంబంధించిన సమస్యలు జిల్లా స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు హితవు పలికారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకముందు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఆలంపూర్‌లో జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంపూర్ శాసన సభ్యులు విజయుడు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు భూ భారతి చట్టంపై అవగాహన పెంపొందించుకొని దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఆర్డీఓ శ్రీనివాసరావు, డి.సి.సి.బి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప,అలంపూర్ తహాశీల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్, రైతులు, పాల్గొన్నారు.



అవగాహన సదస్సు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బి.యం సంతోష్



అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

## సిద్దయ్యపల్లి డబుల్ బెడ్

# ఇళ్లకు నోటీసులు

- ఆందోళనలో లబ్ధిదారులు
- మూడింటా రెండో వంతు మందికి నోటీసులు
- సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందన్న తహసీల్దార్

**భూత్పూర్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ ఒకటో వార్డు సిద్దయ్యపల్లిలో గత ప్రభుత్వం మంజూరు చేసిన 288 డబుల్ బెడ్ ఇళ్ల పంపిణీ ఓ ప్రహసనంగా మారింది.ఇళ్లు కేటాయించిన నాటి నుంచి నేటి వరకు ఎదో ఒక కారణం చూపుతూ విచారణల మీద విచారణలు జరిగాయి.డబుల్ బెడ్ ఇళ్లను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గత ఎమ్మెల్యే అర్హులైన వారందరికి ఇళ్లు మంజూరు చేశారు.మంజూరైన ఆర్నెళ్లకే ప్రభుత్వం మారడం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నోటీసులు రావడమేంటని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వం ఒకటికి నాలుగు సార్లు విచారణ జరిపి తమకు ఇళ్లు కేటాయించిందని,దీనిపై కొత్తగా రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పలుమార్లు విచారణలు జరిపి చివరకు 199మందికి నోటీసులు జారీ చేయడం విడ్డూరంగా ఉందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.గతేడాది మొత్తం చెకింగ్‌లు,విచారణలకే కాలం గడిచిపోయిందని,ఈ ఏడాది మార్చి తర్వాత 288మంది లబ్ధిదారుల్లో 199మంది లబ్ధిదారులను అనర్హులుగా ప్రకటిస్తూ వారికి నోటీసులు జారీ చేయడం తమకు కలవరాన్ని కల్గిస్తోందని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డబుల్ బెడ్ ఇళ్లు పొందినవారంతా బీపీఎల్ కింద అర్హులమేనని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇందులో డబుల్ బెడ్ ఇళ్లు పొందిన జర్నలిస్టు లబ్ధిదారులకు నోటీసులు జారీకావడం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఎమ్మెల్యే ఆల జర్నలిస్టులందరికి డబుల్ బెడ్ ఇళ్లు కేటాయించి సహసోపేతమైన చర్య తీసుకున్నారని,ప్రస్తుత ప్రభుత్వం డబుల్ బెడ్ ఇళ్లు పొందిన జర్నలిస్టులకు నోటీసులు జారీ చేయడమేంటని పలువురు జర్నలిస్టులు ప్రశ్నిస్తున్నారు.గత ప్రభుత్వం అక్రిడిటేషన్ కల్గిన ప్రతి జర్నలిస్టుకు డబుల్ బెడ్ ఇల్లు కేటాయించింది. మండల జర్నలిస్టులు మండలంలో ఎక్కడైనా డబుల్‌బెడ్ ఇళ్లు పొందవచ్చని, స్థానికత అంశమే వెలువడే ఆస్కారమేలేదని మండల జర్నలిస్టులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.పాతికేళ్ల జర్నలిస్టు వృత్తిలో ఉంటూ ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకం అందుకోని జర్నలిస్టుకు గత ప్రభుత్వం కల్పించిన డబుల్ బెడ్ ఇంటి సౌకర్యాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లేకుండా చేస్తోందనే విమర్శలు జర్నలిస్టుల నుంచి బాహాటంగా వ్యక్తమౌతున్నాయి. ప్రభుత్వం జర్నలిస్టులకు కల్పిస్తున్న ఈ డబుల్ బెడ్ ఇంటి సదుపాయాన్ని రద్దు చేయకుండా జర్నలిస్టుల కనీస సౌకర్యాన్ని కాపాడాలని,జర్నలిస్టుల నోటీసుల అంశాన్ని పునరాలోచించాలని డబుల్ బెడ్ ఇళ్లుపొందిన జర్నలిస్టులు స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



భూత్పూర్ మున్సిపాలిటీ

ఒకటో వార్డు సిద్దయ్యపల్లి డబుల్ బెడ్ ఇళ్లు

**తహసీల్దార్ జయలక్ష్మి వివరణ :**

గతంలో భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు సిద్దయ్యపల్లిలో గత ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్ ఇళ్లను తమ ప్రభుత్వ అధికారులు పలుమార్లు తనిఖీ నిర్వహించి వారిచ్చిన సూచనలమేరకే డబుల్ బెడ్ ఇళ్ల లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశామని,ఇచ్చిన నోటీసులకు వారం రోజుల లోపు సంజాయిషీతో పాటు సంబంధిత ఆధార పత్రాలతో తమ కార్యాలయంలో సమర్పించాలని,వారిచ్చిన సంజాయిషీ, సంబంధిత ఆధార పత్రాలను కలెక్టర్ కార్యాలయానికి పంపుతామని భూత్పూర్ తహసిల్దార్ జయలక్ష్మి'ప్రభాతవార్త'కు తెలిపారు.

## రైతును రాజు చేయడమే

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఆందోళన వద్దు ప్రతి గింజను కొంటాం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి అన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని జిల్లా స్థాయి అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో తడిచిన మొక్కజొన్న ధాన్యాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకే తమ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు. అకాల వర్షం వల్ల రైతులకు ఇబ్బందులు కలిగాయని, వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గంలో ఎక్కడ రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. విపక్షాలు విమర్శలు మానుకొని రైతులకు అండగా నిలిచే విధంగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన వాటికి వెంటనే బిల్లులు చెల్లించేలా కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం రైతుల పక్షపాతి కాబట్టే ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావుతో పాటు డైరెక్టర్లు నాయకులు రైతులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**బలిజపల్లి సిపిసిఎస్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కొనుగోలు కేంద్రాల నిర్వహకులను హెచ్చరించారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ఆయన సోమవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దమందడి మండలం బలిజపల్లిలో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని, వనపర్తి మండలం అంకుర్‌లో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యం గురించి ఎవ్వరు అధైర్య పడరాదని కొనుగోలు కేంద్రాలలోని చివరిగింజ వరకు కొంటామని ఆయన అన్నదాతలకు భరోసా కల్పించారు. బలిజపల్లి కొనుగోలు కేంద్రంలో నిర్వాహకుల నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతుల వివరాలు నమోదు చేయాలని, కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించిన ఎందుకు పాటించడం లేదంటూ నిలదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక తహసిల్దార్ సరస్వతిని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తే తనకు చిన్న మెసేజ్ పంపిన వెంటనే స్పందిస్తామని ఆయన సూచించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, పెద్దమందడి వనపర్తి మండలాల తహసిల్దారులు, అధికారులు, రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**

గోపాల్‌పేట మండల కేంద్రంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, కేంద్రం వద్ద రైతులు సేద తీరేందుకు నీడ, నీరు ఏర్పాటు చేయాలన్నారు. తేమశాతం వచ్చిన వెంటనే వడ్లను కొనుగోలు చేయాలంటూ నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో తహసిల్దార్ తిలక్‌రెడ్డి, ఉమ్మడి, డిపిఎం భాష, గోపాల్‌పేట మండలం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సత్యశీలరెడ్డి, కోటిరెడ్డి, శివన్న, కొంకి వెంకటేష్, గోపాల్, రాజు, మహిళా సమైక్య సభ్యురాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి : బిఆర్ఎస్, బిజెపి పార్టీల డిమాండ్

**బిజినేపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్,బిజెపి పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. లట్టుపల్లి ఐకెపి కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని ఆయా పార్టీలు వేరువేరుగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్,బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం పులేందర్ రెడ్డి రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి తడిసిన వరి ధాన్యాన్ని, ఈదురుగాలులకు ఒరిగిన మొక్కజొన్న వరి పంటలను సందర్శించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రంగు మారిన తడిసిన ప్రతి గింజను కొను కొనుగోలు చేసి రైతన్నలను ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట సకాలంలో కొనుగోలు చేయక అకాల వర్షానికి అవస్థ పడాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. గెలువగానే రైతుల ఖాతాల్లో వేస్తానన్న రైతుబంధు వేయకపోగా, క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతాంగాన్ని అడుగడుగున మెసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతన్నలను ఆదుకోవాలని, కొనుగోలు కేంద్రాలలో ఉన్న వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని, ఈదురుగాళ్లకు నేలకొరిగిన పంటలకు పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బిఆర్‌ఎస్ నాయకులు తిరుపతి రెడ్డి, సురభి శేఖర్‌రావు,శీర్ణం బాలస్వామి, బసవరెడ్డి రాజేందర్ గౌడ్,లక్ష్మయ్య,వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.



నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు



తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు వేముల నరేంద్ర రావు కోరారు. అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. రంగు మారిన, తడిసిన ప్రతి గింజను -మిగతా2లో..

## 25 నుంచి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు


మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు బి.గోపాలం

**మక్తల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూరు మండలం బిజ్వార్‌లో ఈనెల 25 నుంచి 27 వరకు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం తెలిపారు. మక్తల్ పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజ్వార్‌లోని అంబ్రత్రయ క్షేత్రం వద్ద నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 600 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి, మే 9 నుంచి 11 వరకు చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, కార్యదర్శి రమేష్ కుమార్, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తాన్‌సింగ్, పీఈటీలు విష్ణువర్ధన్, నీలిరఘు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్రరావుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

**మల్దకల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మల్దకల్ మండల కేంద్రానికి చెందిన పట్వారి రాఘవేంద్రరావు మృతి పట్ల గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. సోమవారం రాఘవేంద్రరావు పార్థివ దేహం పై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రావ్ కుమారుడు బాబురావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, తాటికుంట మధుసూదన్ రెడ్డి, సీతారాం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచులు దామ నాగరాజు, నరేందర్, యాకోబు, నాయకి మధు, ఎంఈఓ వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి మురళీధర్ రెడ్డి, రమేష్ రెడ్డి, మధుసూదన్ రావు, చంద్రశేఖరరావు, వెంకటన్న, నరసింహులు, నర్సి రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు బాదామి శ్రీనివాసులు, మనసాని నాగరాజు తదితరులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం


గుడి నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

**ఆత్మకూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణం లో నూతనంగా నిర్మిస్తున్నటువంటి పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి ఆత్మకూరు పట్టణానికి చెందిన పలువురు వ్యాపారస్తులు పెద్ద ఎత్తున విరాళాలను అందజేశారు. సోమవారం పెద్దమ్మ తల్లి గుడి ఆలయ కమిటీ అధ్యక్షుడు మొగిలి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యాపారస్తులైన వెంకటేష్‌శెట్టి ,రమేష్‌శెట్టి,నీలేష్ కుమార్ తదితరులు మూడులక్షల రూపాయలను విరాళంగా అందజేసినట్లుగా కమిటీ అధ్యక్షుడు తెలిపారు.పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి పెద్దమ్మ తల్లి గుడినిర్మాణానికి పట్టణ ప్రముఖులతో పాటుగా నియోజకవర్గ నాయకులు సైతం కలిసి విరాళాలను సేకరించి త్వరలోనే గుడినిర్మానం పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. విరాళాలు సేకరించిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ యాదవ్ ,మనివర్ధన్ రెడ్డి ,యాదగిరి శెట్టి,కొత్తబోయి శేఖర్,జానకి రాములు తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ చైర్మన్


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

**పెబ్బేరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం గుమ్మడం తిప్పాయిపల్లి చిన్న గుమ్మడం గ్రామాలలో సోమవారం పెబ్బేర్ మార్కెట్ కమిటీ, మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల నుంచి వృధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం గన్ని బ్యాగులు రైతులు కూర్చోవడానికి టెంటు ఏర్పాటు చేయాలని అన్నదాతలకు ఏమాత్రం ఇబ్బందులు కలవకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, శ్రీరంగాపూర్ సింగల్ వందర్ చైర్మన్ జగన్నాథం నాయుడు, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, నాయకుల యుగంధర్ రెడ్డి, వీరస్వామి నాయుడు, మహేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ కృష్ణయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు రాజేష్, రణధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అమరచింత,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అమరచింత మండల వ్యవసాయఅధికారి,అరవిందు రైతులను కోరారు.సోమవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని సబ్‌స్టేషన్ దగ్గర ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలుకేంద్రాన్ని డిసిసి జిల్లా కార్యదర్శి,అయూబ్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు.ఈసందర్భంగా ఏఓ అరవింద్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 బోనాసిస్తుందని వరి ధాన్యం పండించిన ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు విక్రయించుకోవాలని ఆయన కోరారు. రైతులు పండించిన పంటలను దళారులకు విక్రయించరాదని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, కేజీ మహేందర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, పోసిరి విష్ణు, హనుమంతు నాయక్, రామ లక్ష్మారెడ్డి, పెద్ద బాలరాజ్, శ్యాం కుమార్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కరపత్రాలు, ఆడియో సిడి విడుదల

**పెబ్బేరు,ఏప్రిల్21 ప్రభాతవార్త:**పెబ్బేరు మండలం యాపర్ల ప్రాథమిక పాఠశాల నందు ముందస్తుగా బడిబాట కార్యక్రమం కరపత్రాలు, ప్రత్యేకంగా తయారుచేసిన బడిబాట ఆడియో సిడిని సోమవారం పాఠశాల నందు విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి ప్రాథమిక పాఠశాల యాపర్ల నందు నర్సరీ నుండి యూకేజీ వరకు అదనంగా తరగతులు, ఫ్రీ ప్రైమరీ, ఉచిత గురుకుల శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయుడు బొల్లు హుస్సేన్ యాదవ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు నరసింహారావు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు శంకర్ గౌడ్, ఉపాధ్యాయులు మురళి కృష్ణ, భాగ్యలక్ష్మి, ఈశ్వర్ రెడ్డి, బాలమ్మ, సురేందర్, అంగన్వాడి టీచర్లు గ్రామ పెద్దలు నరేందర్ రెడ్డి స్వరాజ్యం బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని మండల బిజెపి నాయకులు సోమవారం ఎంపీఓ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ మాట్లాడుతూ గడచిన 12 వారాలుగా ఉపాధి కూలీలకు పనిచేసిన దినాలకు సంబంధించిన కూలీ డబ్బులు పొందడం లేదు వెంటనే వారికి పులి డబ్బులు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఐసిఐ సిఐ బ్యాంకు నుండి కూలీ డబ్బులు సరిగ్గా రావడంలేదని పోస్ట్ ఆఫీస్ కు లేదంటే మరేదైనా ఇతర బ్యాంకులకు మార్చాలని వారు కోరారు. ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు వారు పనిచేసే దగ్గర నీడ కోసంటెంట్లుతో పాటు త్రాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దశరథం గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేష్ మండల పార్టీ యువమోర్చా అధ్యక్షుడు గోపి సీనియర్ నాయకులు బెస్త శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న వి.వేణుగోపాల్

**కల్వకుర్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన మన సేవా సమితి అధ్యక్షులు వి.వేణుగోపాల్‌కు ఆలూరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ మరియు ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సోమవారం హైదరాబాద్ రాష్ట్ర సిఎస్ సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్, సామాజిక నాయకులు పివిపి అంజనీకుమారికి, డాక్టర్ ఆశన్ బ్రహ్మ శంకర్ నారాయణ, రివర్స్ రీడ్ గురుస్వామి, రిటైర్డ్ పోలీస్ అధికారి ప్రేమారెడ్డి, ఆర్చిత, ఆలూరి విల్సన్, ఇందిర, విశ్వేశ్వరరావులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వి.వేణుగోపాల్ మాట్లాడుతూ తాము ఎన్నో చేసినందుకు తమకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సన్మానంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆలూలమరి విల్సన్, ఇందిర, డాక్టర్ చంద్రమోళి, జ్యోతి, గూణ రాధా, వెంకటలక్ష్మి బుక్కపట్నం రమాదేవి, డాక్టరేట్ గ్రహితలు ప్రమిళమాధూరి, గోపయ్య, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, నాగసాయిసంపత్, వరలక్ష్మి, ఉషారాణి, అమిత, చౌహాన్, ధరణి, లావణ్య పటేల్, బ్రహ్మణి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ ఈదురుగాలలకు నేలరాలిన మామిడి కాయలు

- 150 టన్నులకు పైగా వాటిల్లిన నష్టం
- వనపర్తి జిల్లా మొత్తంలో 827ఎకరాలలో 33 శాతం నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా
- ప్రాథమిక అంచనా తయారు చేస్తున్న అధికారులు



**వీపనగండ్ల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో ఆదివారం విచిన భారీ ఈదురుగాళ్లకు చేతికి వచ్చినటువంటి మామిడి కాయల పంట నేలమట్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపుగా మూడు నెలల నుండి కాయలు తెంపుతుండడం జరుగుతుందని వాటిని మార్కెట్లోకి తీసుకుపోతున్న సందర్భంలో అక్కడ రేటు లేక అనేక ఇబ్బందులు పడుతున్న రైతులకు అకాల ఈదురు గాలులు రావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది అనే కౌలు రైతు పెబ్బేటి మహేష్ నక్క రాముడు, మిద్దె శ్రీనివాసులు ,తమ ఆవేదనలు వ్యక్తం చేశారు. మార్కెట్లోకి వెళితే రేటు టన్ను ధర వచ్చేసి 30 వేలరూపాయల నుండి 50 వేల రూపాయల వరకు ధర పలుకుతుందని వారు తెలిపారు. అయితే ఆదివారం వచ్చినటువంటి ఈ అకాల ఈదురుగాల వల్ల ఎకరాకు వచ్చేసి అధికారుల అంజన ప్రకారంగా టన్ను కాయ రాలినట్లు ప్రాథమిక అంచనా వేశారు. అయితే వనపర్తి జిల్లా మొత్తంలో 827 ఎకరాలలో 409 మంది రైతులకు సంబంధించిన మామిడి కాయలు రాలినట్లు తెలుస్తుంది. అయితే ఒక్క వీపనగండ్ల మండలంలోని 599 ఎకరాలలో 290 మంది రైతులకు సంబంధించిన మామిడి తోటలో కాయలు నేలమట్టం అయినట్లు తెలుస్తుంది. అయితే ఒక వీపనగలను ఉంటే ఆదివారం వీచిన గాళ్ళకు రాలిపడ్డ కాయను తీసుకపోవడానికి సోమవారం బులోరాలు పెట్టి దాదాపు 25 కు పైగా రాలిన కాయను మార్కెట్‌కు తీసుకుపోవడం జరిగింది. అయితే ఒక్క బులోరాకు సంబంధించి మూడు టన్నుల కాయ పడుతుందని రైతులు తెలిపారు. ఆ విధంగా లెక్క వేసుకుంటే మొత్తం మండలంలోని దాదాపుగా 80 టన్నులకు పైగా కాయ రాలినట్లు తెలిపారు. అయితే ఈ లెక్క ప్రకారం రైతుకు ప్రస్తుతం ఉన్న రేటు ప్రకారంగా చెంచిన కాయ అయితే టన్నుకు 45 వేల రూపాయలు పోతుందని ఈ లెక్కన చూస్తే ఇప్పుడు రాలినటువంటి కాయను మార్కెట్‌కు తీసుకుపోతే ధర ఎంత పోతుంది అనేది కూడా చెప్పలేమని రైతులు అంటున్నారు. ఇదిలా ఉంటే ప్రాథమికంగా అధికారులు అంచనా ప్రకారం వీటికి నష్టపరిహారం అనేది అంచనా వేయడానికి దాదాపుగా 33 పైగా మామిడికాయలు రాళ్తే ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడానికి అవకాశం ఉంటుందా లేదా అనేది ఇప్పుడే స్పష్టంగా చెప్పలేమని ప్రాథమిక నివేదిక అయితే పై అధికారులు పంపమని తెలిపారని హార్టికల్చర్ అధికారి కృష్ణయ్య తెలిపారు. అకాల ఇదరగాళ్లకు రాలిపోయినటువంటి మామిడికాయల రైతులను ఆదుకోవాలని ఈ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**చేతికి వచ్చిన మామిడి పంట ఈదురుగాళ్ల పాలు**


మహేష్ , రైతు

ఒక రెండు రోజుల్లో మామిడికాయలు తెంచుకొని మార్కెట్‌కు తీసుకపోయే సందర్భంల్లో ఈదురు గాలులు వచ్చి కాయలు మొత్తం రాలిపోవడం జరిగిందని దీనితో దాదాపు రెండు లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

# వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని ర్యాలీ నిర్వహించిన ముస్లీం సోదరులు

ముస్లిం లకు మద్దతు ఇచ్చిన అఖిల పక్షం నాయకులు





ముస్లిం ర్యాలీకి మద్దత్తు ఇస్తున్న ఎమ్మెల్యే, మాజీ చైర్మన్ సరిత, అఖిల పక్ష నాయకులు

**గద్వాల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు గద్వాల జిల్లా కేంద్రంలో మత పెద్దల ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే విరమించుకోవాలని ముస్లింల మహా ర్యాలీ జరిగింది. రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుతూ, గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన ముస్లిం మైనార్టీల ర్యాలీ గద్వాల పట్టణంలో విజయవంతంగా, శాంతియుతంగా జరిగింది. ఉదయం 8 గంటలకు మక్కా మసీదు నుండి ప్రారంభమైన ర్యాలీకి అనేక రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, అఖిల పక్షం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వక్ఫ్ బిల్లును వెంటనే విరమించుకోవాలని, లేని పక్షంలో బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను చవిచూస్తుందని వారు హెచ్చరించారు. వందల సంవత్సరాలుగా, నిరాటకంగా కొనసాగుతున్న వక్ఫ్ బోర్డ్,దాని కార్యకలాపాలను ఇప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమి వచ్చిందని ఆయా రాజకీయ పార్టీలు, అఖిలపక్షం ప్రశ్నించింది. ఇది పేద ముస్లింల సంక్షేమం కోసమే చేస్తున్నామని బిజెపి, ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. గత అనేక సంవత్సరాలుగా మతసామరస్యాన్ని దెబ్బ తీసే విధంగా, విష ప్రచారానికి పూనుకున్నాయన్నారు. ఆయా పార్టీల అఖిల పక్ష నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వారు ఉద్ఘాటించారు. మక్కా మసీదు దగ్గర ప్రారంభమైన ర్యాలీకి కిష్టారెడ్డి బంగ్లా దగ్గర గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబర్ , ఎమ్మెల్యే అనుచరులు ర్యాలీ లో పాల్గొని ప్రసంగించారు. వక్ఫ్ బిల్లును వెంటనే విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన ప్రకటించారు. మైనార్టీల పోరాటానికి తాను సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. పాత బస్టాండ్ దగ్గర కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇన్చార్జి, జడ్పి మాజీ చైర్మన్ సరిత తిరుపతయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇస్సాక్, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్ గౌడ్, హాఫిజ్, గట్టు గౌస్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంటులోను, రాజ్యసభలోను పోరాటం చేసిందని, మందబలంతో బిజెపి పార్లమెంటులో బిల్లును సవరణ చేసుకున్నప్పటికీ పార్లమెంటు బయట ప్రజా క్షేత్రంలో ఓడిస్తామని అన్నారు. మైనార్టీలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అదేవిధంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మద్దతు ప్రకటించి మాట్లాడారు. అఖిలపక్ష జిల్లా చైర్మన్,బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు , అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ అబ్బాస్ , జబ్బార్ మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ తరపున ఈ నల్ల చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతోపాటు దానికోసం చివరి వరకు పోరాడుతామని చెప్పారు. ఈ ర్యాలీలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు కన్వీనర్ అతికూర్ రెహమాన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు మున్నాబాష, కురువ పల్లయ్య, ఆటోమక్బుల్, రఫీ, ఆటో చాంద్ పాషా, ఫర్టిలైజర్ ఖలీల్ తదితరులు మాట్లాడారు. దళిత సంఘాల నాయకులు ఆర్.మోహన్ , పాలమూరు అధ్యయన వేదిక ఎక్బల్ పాషా, మత పెద్దలు మౌలానా మొహమ్మద్ హకీం సహబ్, మౌలానా అబ్బాస్ సహబ్, మౌలానా ఉస్మాన్ సహబ్, మౌలానా మతులుబ్ హుస్సేన్ సాహబ్, మౌలాన ఉస్మాన్ సాహెబ్,ఎం ఆర్ పి ఎస్ హనుమంతు, రహమతుల్లా, ఆటో చాంద్, టవర్ మక్బూల్, యూనస్, దౌలత్, ఈ ర్యాలీ ప్రశాంతంగా, క్రమశిక్షణతో కొనసాగడానికి కృషి చేసిన వాలంటీర్లకు అందరూ అభినందలు తెలిపారు. డిఎస్పీ మొగులయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లు కళ్యాణ్ కుమార్, షకూర్, శ్రీకాంత్ లతో ఇతర మండలాల ఎస్సైలు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీ అనంతరం అదనపు కలెక్టర్ నర్సింగ రావు ముస్లిం మత పెద్దలు, అఖిల పక్ష నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.

## మెరుగైన విద్యను అందించాలి : ఎమ్మెల్యే విజయుడు



విద్యార్థులతో ఎమ్మెల్యే విజయుడు

**మానవపాడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే విజయుడు స్థానిక తాహసిల్దార్ శ్రీనివాస్ శర్మ జోషి, ఎంఈఓ శివప్రసాద్‌లతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలలో సౌకర్యాల కల్పనలకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఎంఈఓ శివప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రభుత్వపాఠశాలమీద నమ్మకం కలుగుతుందని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పిస్తూ వాళ్లలో విద్య నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చక్కటి విద్యార్థులు నేర్పించే ఉపాధ్యాయులు ఉన్నారని పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తల్లిదండ్రులకు తెలిపారు. మీ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. దాతల సహకారంతో పాఠశాల గోడలపై మహనీయుల చిత్రపటాలు వేయించడం జరిగిందని అలాగే ఈ వార్షికోత్సవ వేడుకల తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. విద్యా కమిటీ చైర్మన్ భాష, ఉపాధ్యాయులు రామేశ్వర్ రెడ్డి, విజయమ్మ, శ్రీలేఖ, జోగులాంబ గద్వాల జిల్లా టీఎస్ యుపిఎఫ్ అధ్యక్షులు రమేష్, పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ రోగులకు పెన్షన్ చెల్లించాలి : ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి

**ఆత్మకూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా డయాలసిస్ రోగులకు ప్రభుత్వం నెలకు 2000 రూపాయల పెన్షన్ చెల్లించాలని అఖిల భారత యువజన సమాఖ్య వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి కుతుబ్ విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ఆయన సోమవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తం గా పెద్ద ఎత్తున డయాలసిస్ పేషెంట్లు ప్రతినిత్యం మందులు కొనుగోలు చేయలేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని గత ఎన్నికల సమ యంలో డయాలసిస్ పేషెంట్లకు పెన్షన్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం తక్షణమే నిలబెట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం తక్షణమే ఇక్కడి నుండి సామాగ్రిని జిల్లా కేంద్రానికి తరలించడం పట్ల రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని తమ పోరాటాల ఫలితంగానే మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి తాత్కాలిక సేవలు అందించేందుకు కంటైనర్‌ను ఏర్పాటుచేయడం శుభపరిణామం అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డయాలసిస్ పేషెంట్లకు ప్రతినెల 2000 రూపాయల పెన్షన్ చెల్లించాలని లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని హెచ్చరించారు.

## ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలి


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

**అమరచింత, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో అధికారులు కనీస వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, అజయ్ అధికారులను కోరారు. సోమవారం అమరచింత మండలంలోని చంద్రప్ప తాండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో భూములు లేని కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం అమలు చేయడం లేదని ఇప్పటికైనా జాబ్ కార్డు కలిగిన కుటుంబాల అందరికీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతల పద్ధతిని రద్దుచేసి రోజుకు 600 ఇవ్వాలని అలాగే ఏడాదికి రెండు వందల రోజులు పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు వేసవికాలంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, టెంటు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, త్రాగునీరు, గడ్డపారతోపాటు, తట్ట బుట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఆయా గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలను అధికారులు వెంటనే చెల్లించాలని లేనిచో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవి నాయక్, శంకర్, సీతమ్మ, విజయమ్మ, గోపాల్, రాములమ్మ, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో



21ఎంబిఎన్ఆర్ 3: ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంపిడిఓ

**నవాబుపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండల ప్రజలు ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపీడీవో జయరాం నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులకు రాజులకు సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కార మార్గం చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీఓ బద్రునాయక్ ఏపీఓ జ్యోతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూత్పూర్‌లో నేడు భూభారతి

**హాజరుకానున్న ఎమ్మెల్యే జీఎంఆర్,కలెక్టర్ విజయేంద్రబోయి**

**భూత్పూర్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యా ప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతిపై సోమవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని కేవీఎన్ ఫంక్షన్ హాల్‌లో ఉద యం 9గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల తహసిల్దార్ జయలక్ష్మి తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ముఖ్యఅతి థిగా హాజరౌతారని పేర్కొన్నారు. అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయితో పాటు ఆర్డీఓ మోహన్‌రావు హాజౌ తారని,మండలంలోని రైతులు,భూ యజమానులు ఈ అవగాహన సదస్సుకు సకాలంలో హాజరుకావాలని తహసిల్దార్ జయలక్ష్మి కోరారు.

## కంటి వైద్య శిబిరం విజయవంతం

**మక్తల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని కర్నిలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. మహబూబ్ నగర్‌లోని కందూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి, వాకిటి శ్రీహరి అన్న సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 45 మందికి కంటి పొరల సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారిని శస్త్ర చికిత్సల నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. వీరికి శస్త్రచికిత్సతో పాటు ఉచితంగా కంటి అద్దాలు, మందులను అందించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు రవికుమార్, కట్ట సురేష్ తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు ప్రమోద్, పంచాయతీ కార్యదర్శి మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు

**మానవపాడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** రాజోలి మండల పరిధిలోని తుమ్మలపల్లి, మాన్‌దొడ్డి గ్రామాలలో పశువులకు సోకే గాలి కుంటు వ్యాధులకు ఉచితంగా టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి మల్లేష్ తెలిపారు. సోమవారం రెండు గ్రామాలలో ఆయన పర్యటించారు. 33 మంది పాడి రైతులకు సంబంధించి ఆవులు, ఎద్దులకు, 131 గేదెలకు 301 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధులు సోకకుండా తప్పనిసరిగా ఉచితంగా టీకాలు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కార్తీక్, సుజాత, శివా, లక్ష్మన్న రాఘవేంద్ర పాడి రైతులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి : బిఆర్ఎస్,బిజెపిపార్టీల డిమాండ్

మొదటి పేజీ తరువాయి భాగం..

కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షం వల్ల చెతికి వచ్చిన పంట తమ కండ్ల ముందే తడసిందని రైతులు అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లర్లతో మాట్లాడి వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని అన్నారు.రాత్రి కురిసిన అకాల వర్షానికి కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయిపోయింది. చేతికొచ్చిన పంట వర్షానికి తడిసి ముద్ద కావడంతో మొలకలొచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి, పార్లమెంటు ఇన్చార్జి సుధాకర్ రెడ్డి, మహిళా జిల్లా నాయకురాలు చంద్రకళ, సీనియర్ నాయకులు నారాయణ చారి, అతినారపు తిరుపతయ్య , రఘుబాబు, రమేష్ ఓం ప్రకాష్, రంజిత్, కృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుమ్మకొండ భూషయ్య, మండల అధ్యక్షులు పిట్టల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## దళారుల మాయ మాటలు నమ్మొద్దు

**వరిధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరుగుతుంది : ఎమ్మెల్యే డా.కూచుకుల్ల రాజేష్‌రెడ్డి**



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** వరిధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరుగుతుందని, రైతన్న దళారుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్‌రెడ్డి సూచించారు. మంగనూరు గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్నలకు అండగా ఉండి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతన్నలు తమ ధాన్యాన్ని అమ్మి క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి రూ.2320, కామన్ గ్రేడ్ రకానికి రూ.2300 పొందాలని సూచించారు. వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన సంబంధిత రైతు ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని చెప్పారు. సన్న రకం ధాన్యానికి అదనంగా రూ. 500 ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాయినోళ్ళ బాలరాజ్ గౌడ్, మాజీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ జెడ్పిటిసి పరశురాములు, మాజీ సర్పంచులు అమృత్ రెడ్డి, తిరుపతయ్య, రామ్ రెడ్డి,బాలరాజు, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మల్లికార్జున్, గోవింద్ నాయక్ వాళ్యనాయక్ కత్తె ఈశ్వర్ శ్రీనివాస్ గౌడ్ నరేందర్ గౌడ్ పాషా జాలం కృష్ణయ్య నాగయ్య కటిక శ్రీను ఐకెపి ఏపిఎం విజయ, సీసీ కళావతి, గ్రామ,అధ్యక్షురాలు శారద రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు అవగాహన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ప్రసాద్

**ఆత్మకూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో జాతీయ ఉపాధి హామీ కూలీలకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన 10నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని అంతేకాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేసిన కూలీలందరికీ 12 వేల రూపాయలను కూలీల ఖాతాలో తక్షణమే జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కచ్చితంగా ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని రోజుకూలి కనీసం 600 రూపాయలు చెల్లించే విధంగా ప్రభుత్వం అధికారులను ఆదేశించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వేసవికాలంలో ఎండలు మండిపోతుండగా ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం చాలా విచారకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలీలు పనిచేసే స్థలంలో మంచినీటి వసతి తో పాటుగా రోగాల పారిన పడిన వారికి మందులను అందజేసే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తదితరులతో పాటుగా పలువురు కూలీలు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమాలకు సిద్ధం కావాలి



**అమరచింత, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ ఎంఎల్‌మాస్ లైన్ డివిజన్ నాయకులురాజు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి, కే రాజన్న పిలుపునిచ్చారు. సోమవారం అమరచింత పట్టణంలోని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుడు కామ్రేడ్ చింతలయ్య వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం దగ్గర సిపిఎంఎల్ మాస్ లైన్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కామ్రేడ్ చింతలయ్య గత 40 ఏళ్లుగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తి అని అన్నారు. కామ్రేడ్ చింతలయ్య బీడీ, వ్యవసాయం కూలీల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని వారు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా అమరుల ఆశయ సాధన కోసం ప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎంఎల్ మాస్ లైన్ నాయకులు సామేలు, కురుమన్న,భక్తరాజ్, ఏసన్న, జిలాని, ఆనంద్, చింతలయ్య భార్య సుమిత్రమ్మ, సత్యనారాయణ, విజయ్,జగదీష్,లక్ష్మి,కురుమక్క, మసలమణివీరితో పాటు అరుణోదయ కళాకారులు పాల్గొన్నారు.

## మే 3న మెగా జాబ్ మేళా



జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కే.రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం జాబ్ మేళాకు సంబంధించి వాల్ పోస్టర్‌నుభీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో మే3 శనివారం ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 4 గం.ల వరకు మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. నారాయణపేట జిల్లాలో చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు, ఉపాధి లేక అనేక మంది యువతీ యువకులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తెలుసుకుని వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 25 ప్రముఖ ఎం.ఎన్.సీ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. నారాయణపేట జిల్లాలో ఉన్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ మెగా జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని రాజ్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, పోలీసు పటేల్ మధుసూదన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ గౌడ్, రుద్రారెడ్డి, హనుమంతు, వై.సంతోష్, శివరాజ్, ఎం.సంతోష్, నరేష్ గౌడ్, ప్రవీణ్, విజయ్, రాజు తదితరులు ఉన్నారు.

## క్రిస్టియన్ కాలనీలో పోషణపక్షం కార్యక్రమం



పోషణపక్షం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం వార్డు నంబర్ 48 క్రిస్టియన్ కాలనీలో సోమవారం పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ వసీం సుల్తానా ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులకు తగిన ఆరోగ్య పరమైన సలహాలు, సూచనలు అందజే శారు. గర్భిణులు తీసుకునే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. అనంతరం హ్యాండ్ వాష్ పోషణపక్షం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీజే బెనహర్, ఏఎల్‌ఎంఎస్ కమిటీ సభ్యులు, అంగన్‌వాడి టీచర్లు పద్మ, కళారంజని, సువర్ణ, లలిత, చంద్రకళ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నాణ్యత పాటించాలి

**నిబంధనలకు విరుద్ధంగా కోతలు చేసే హార్వెస్టర్లపై చర్యలు : అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** వరి ధాన్యం సరసమైన సగటు నాణ్యత నిబంధనలకు విరుద్ధంగా కోతలు చేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు హార్వెస్టర్లను సూచించారు.జిల్లాలో వరి కోతలు విస్తృతంగా కొనసాగుతున్న తరుణంలో సోమవారం మధ్యాహ్నం ఐడిఓసి సమావేశ హాల్లో హార్వెస్టర్లు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కొను గోలు కేంద్రాలు సందర్శించినప్పుడు చాలా చోట్ల వరిలో తాలు, మట్టి, గడ్డి ఎక్కువగా కనిపిస్తుందని అందుకే కోతలు ఎలా ఎప్పుడు చేయాలి, సరసమైన సగటు నాణ్యత (ఎఫ్ఎక్యూ) నిబంధనలు ఏమున్నాయిఅనేదానిపై జిల్లాలోని కోత యంత్రాలు నిర్వాహకులు, యజమానులు, మిల్లర్లు, వ్యవ సాయ విస్తీర్ణాధికారులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వరి చేను కోతకువచ్చినప్పుడే కోతలు చేపట్టాలని, పక్వానికి రాక ముందే కోస్తే పచ్చగాతాలు ఏర్పడుతుందన్నారు. కోత యంత్రాలు వరి చేను కోసేటప్పుడు 1920 ఆర్.పి.యం పెట్టాలని, బ్లోయర్ ఆన్‌లో పెట్టుకొని గేర్ స్లాట్ ఏ2బి1 లో పెట్టీ కోతలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రమాణాలను పాటిస్తేనే సరసమైన సగటునాణ్యత నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం వస్తుందని తెలియజేశారు. జిల్లాలో నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసేందుకు అందరూ సహకరించాలని సూచించారు. నాణ్యత లేని ధాన్యం కొనడం కష్టమని, అందుకే నాణ్యత పాటించాలని సూచించారు. నిబంధనలుపాటించని హార్వెస్టర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నాణ్యతతో వచ్చే ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగు తుందన్నారు. ఈ విషయమై వ్యవసాయ విస్తీర్ణాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు, హార్వెస్టర్లకు అవగాహన కల్పించాలని లేని పక్షంలో ఆర్‌టిఓకు ఫిర్యాదు చేస్తేయంత్రాలు సీజ్ చేస్తారని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, ఆర్‌టిఓమానస,జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, వ్యవసాయ మండల,క్లస్టర్ అధికారులు, డి.యం.,మిల్లర్లు, హార్వెస్ట్ నిర్వాహకులు, యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



చిట్యాల మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రైతులు వరి ధాన్యాన్ని తాలు లేకుండా, తగిన తేమతో కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి త్వరగా లబ్దిపొందాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఉదయం చిట్యాల మార్కెట్ యార్డును సందర్శించి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఐకెపిపి ఎసిఎస్, మెప్మా ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు గోదాము, మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులు పండించిన వరికి సరైన తేమ ఉండి, తాలు, చెత్త లేకుండా తీసుకురావాలని అలాంటి ధాన్యం వెంటనే కొనుగోలు చేసి 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయించడం జరుగుతుందని తెలియజేశారు. తేమ ఎక్కువగా ఉంటే ఉదయం పూట ఎండకు ఆరబెట్టి సాయంత్రం టార్ఫాలిన్ కప్పి అకాల వర్షాల బారిన పడకుండా ధాన్యం కాపాడుకోవాలని సూచించారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ది పొందాలని మాజీ డిసిసి అధికార ప్రతినిధి జనంపల్లి దుష్యంత్‌రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం గురుకుంట కొల్లూరు గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారి వాళ్ళ చేతిలో ధాన్యాన్ని పెట్టి మోసపోవద్దని రైతులకు వివరించారు.ఆరుగాలం కష్టపడి, చెమటోడ్చి పండించిన రైతుల కష్టార్జితాన్ని గత ప్రభుత్వంలోని పాలకులు కటింగ్‌ల పేరుతో అనేక విధాలుగా అవినీతికి అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు.తాము పూర్తి పారదర్శకంగా రైతులకు న్యాయం చేకూర్చేందుకు పనిచేస్తున్నామని అన్నారు. ఎక్కడ కటింగ్‌లు లేకుండా వడ్లు కొనుగోలు చేస్తున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలోకి ధాన్యం తీసుకువచ్చి తమ తమ సీరియల్ నంబర్ పొంది రైతులు ధీమాగా ఉండవచ్చని అతి తొందరలోనే నగదును రైతులకు అందేలా చూస్తున్నామని ఈసారి కూడా సన్న వడ్లకు రూ. 500 బోనస్ అందిస్తామనిఅకాల వర్షాల వల్ల దురదృష్టవశాత్తు పంటలకు నష్టం జరిగితే రైతులకు అధైర్య పడవద్దని వారు అన్నారు. ప్రతి క్వింటాలకు రైతులకు పారదర్శకంగా చెల్లింపులు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అంకితంగా పనిచేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులతో పాటు మండల అధ్యక్షులు నేరటి రామచంద్రయ్య, ఏఎంసీ చైర్మన్ హరలింగం, వైస్ చైర్మన్ తులసి రామ్‌నాయక్, వాసుయాదవ్, సింగిల్‌విండో చైర్మన్ మాడిమోని నరసింహులు, మాజీ ఎంపీపీ అనంతయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి నరసింహులు, టిఆర్ఎస్ నాయకులు చంద్రనాయక్, శంకర్ నాయక్, ప్రేమ్ కుమార్, యువజన నాయకులు రాజశేఖర్,కాంగ్రెస్ నాయకులు రమేష్ గౌడ్, కొల్లి నరసింహులు, రవీందర్, నిలియా నాయక్, ఉమర్ కేశవులు, మచ్చేందర్ ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

## మంచినీటి సమస్యను తీర్చండి

**ఖాళీ బిందెలతో నిరసన**



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న వార్డుల ప్రజలు

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మండలంలోని కురుమూర్తి గ్రామంలో 9,10 వార్డులలో మంచినీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా వార్డులకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మా వార్డులకు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు వచ్చేది.గత రెండు నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. ఈ సమస్యను అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని వార్డులకు చెందిన ప్రజలు తెలుపుతున్నారు. అసలేవేసవికాలం కావడంతో ఆయావార్డులకు మంచినీరు రాకపోవడంతో పక్కవార్డుల లోని కుళాయిల వద్ద మంచినీళ్లు తెచ్చుకుంటున్నారనిబీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ రాము తెలిపారు. అధికారులు స్పందించి 9,10 వార్డుల ప్రజలకు త్రాగునీరు అందించాలని లేనిపక్షంలో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆందోళన చేపడుతామన్నారు.ఈమంచినీటి సమస్యను మండల పంచాయతీ రాజ్ అధికారి అనిల్‌కుమార్ దృష్టికి ప్రభాతవార్త తీసుకెళ్లగా మంగళవారం ఆయా వార్డులకు వెళ్లే పైప్ లైన్‌లకు గేటువాల్ ఏర్పాటు చేసి త్రాగునీరు అందిస్తామని తెలిపారు.

## పెబ్బేరు మున్సిపాలిటీలో నీటి ఎద్దడి సమస్యను తీర్చండి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీలో నీటి ఎద్దడి సమస్య లేకుండా తీర్చాలని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. పట్టణంలోని 4, 7, 8,9, 10,12 వార్డులలో నేటి సమస్య ఉండడంతో ప్రజలు వేసవికాలం ఇబ్బంది పడుతున్నారని చూసి వారికి వెంటనే నీటి సమస్య తీర్చాలని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ కమిషనర్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎల్లస్వామి, మాజీ సర్పంచులు సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ నాయకులు రణధీర్ రెడ్డి, పెద్ద రాములు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి యువకుడు మృతి

**మల్దకల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మల్దకల్ మండల పరిధిలోని మల్లెం దొడ్డి గ్రామానికి చెందిన వినోద్ 19 సంవత్సరాలు ఈనెల తొమ్మిదో తేదీన పురుగుల మందు తాగారు. చికిత్స కోసం గద్వాల్ తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 6 గంటల సమయంమరణించినట్లు హెడ్‌కానిస్టేబుల్‌గోపాల్‌నాయక్ తెలిపారు.

## భూత్పూర్ భూభారతికి తరలిరండి

**భూత్పూర్,ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని కేవీఎన్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 9గంటలకు భూభారతిపై అవగాహన సదస్సు ఉంటుందని,ఈ సదస్సుకు దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి హాజరౌతారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. భూత్పూర్‌పట్టణ,రూరల్ ప్రాంతాల్లోని రైతులు,భూయజమానులు,కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు ఈ అవగాహన సదస్సుకు పెద్ద ఎత్తున తరలిరావాలని వారా ప్రకటనలో కోరారు.

## 27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

**గండీడ్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ఈనెల 27వ తేదీన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెన్నాచెడు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రియాస్ ఫాతిమా ఒక ప్రకటనలో తెలిపారు.ఆరవ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఉదయం 10 గటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశానికి అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లుతెలిపారు. ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్ సైట్‌లో హాల్ టికెట్‌లను డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

## దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగింపు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలో శిల్పారామం యందు గల (46) దుకాణాలు నియమ నిబంధనలను అనుసరించి ప్రకటన ద్వారా ఏప్రిల్ 19 సాయంత్రం 5 గం.ల వరకు ధరఖాస్తులను స్వీకరించుటకు విధించిన గడువును ఏప్రిల్ 30 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ఇతర వివరాల కోసం మునిసిపల్ కార్యాలయం పని దినములలోసంబంధిత అధికారి రవీందర్,సెల్ 91825 19739ను సంప్రదించగలరని ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు. మే2వ తేదీ సాయంత్రం 4 గం.లకు నగర పాలక సంస్థ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

**పెబ్బేరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం వైశాఖపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతిలో రాసిన గురుకుల ఎగ్జామ్ లో ఐదుగురికి సెకండ్ ఫేసులో వచ్చిన రిజల్ట్స్ లో 5 గురుకుల సీట్లు సాధించారు. సంధ్య పాగా లక్ష్మణ్, సంధ్య పాగా కురుమూర్తి, జక్కుల ఉమాదేవి, సంధ్య పాగ దివ్యశ్రీ, నూగునూరు గ్రీష్మ ఆ విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు కావలి గోవింద్ నాయుడు సన్మానించాడు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయరాములు, హెడ్మాస్టర్ భీముడు, ఉపాధ్యాయ బృందాన్ని కూడా శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కావాలి గోవింద్ నాయుడు, సింగల్ విండో వైస్ చైర్మన్ జక్కుల ఆంజనేయులు, హనుమంతు, బలరాం, మన్యం, మైబు, బుచ్చన్న పాల్గొన్నారు.

## శాంతి కోసం పాదయాత్ర

**మూసాపేటలో స్వాగతం పలికిన అయ్యప్ప సేవాసమితి సభ్యులు**



స్వాగతం పలికిన అయ్యప్ప సేవాసమితి సభ్యులు

**మూసాపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ప్రపంచ శాంతి కోసం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం నుండి కాశీ వరకు 24 మందిబృందముతో కాలినడకన ప్రారంభించారు. పాదయాత్ర చేస్తున్న తమిళనాడు బృందానికి సోమవారం మూసాపేటలో సంకల్పసిద్ధి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వారు పాదయాత్ర ప్రారంభించి నేటితో 50 రోజులు కావడంతో వారు అయ్యప్ప స్వామి సన్నిధానంలో గోల్డెన్ జూబ్లీ ఏర్పాటు చేసుకొని అందులో భాగంగా మురుగన్ స్వామికి పంచామృతఅభిషేకాలు ప్రత్యేక పూజలుభక్తి భజనలు గావించారు. పాదయాత్ర చేస్తున్న బృందానికి సంకల్ప సిద్ధి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం ,అన్నదానం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు సేవా సమితి సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో పాదయాత్ర బృందం అధ్యక్షుడు సోమ సుందరం,అయ్యప్ప సేవ సమితి సభ్యులు తిరుపతయ్యగౌడ్, కొంగరి శ్రీనివాసులు, గుపని కొండయ్య, మిడ్జిల్లా విశ్వేశ్వర్, వాకిటి నరహరి, వెంకటంపల్లి రాజు, పాదయాత్ర బృందం పాల్గొన్నారు.

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**◆ డీఎస్పీ ఎన్.లింగయ్య**

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ నల్లపు లింగయ్య బాధితుల నుండి మొత్తం 05 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సీఐ,ఎస్సైలకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నకోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు సూచించారు. భూములకు సంబంధించి గొడవలు పెట్టుకోరాదని అందరూ సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని కోరారు.అధికారులు బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించాలనిఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఫిర్యాదులు పెండింగ్లో ఉంటే వాటికి సంబంధించిన సమాచారాన్ని బాధితులకు తప్పకుండా తెలపాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని డిఎస్పీ కోరారు.

## తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బడిబాట కార్యక్రమం కరపత్రం విడుదల

**అమరచింత, ఏప్రిల్21 ప్రభాతవార్త:** తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అమరచింత మండల తహశీల్దార్ రవికుమార్ కోరారు. సోమవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల లో ముందస్తుగా బడిబాట కార్యక్రమం సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రైవేట్ పాఠశాలలో వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయులు ప్రతి ఇంటికి వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వపాఠశాలలో చేర్పించాలని ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కోరాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ, భాస్కర్ సింగ్, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కృష్ణవేణి, ఏఎస్ఐ, జమీర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మీనా, ఉపాధ్యాయులు, జ్యోత్స్న,భానుప్రియ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మి, సిఆర్పి స్వామి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యాన్ని విక్రయించుకోవాలి

**అయిజ, ఏప్రిల్21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు వరి ధాన్యాన్ని విక్రయించుకొని ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలను వినియోగించుకోవాలని అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మేడికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంతరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ఏఐసీసీ సెక్రెటరీ చత్తీస్గఢ్ ఇంచార్జి సంపత్ కుమార్ ఆదేశాల మేరకు యాసంగి సీజన్‌ఐకెపి వరి కొనుగోలు సెంటర్‌ను ప్రారంభించమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి ధాన్యం గిట్టుబాటు ధర 2,320 బోనస్ కింటాకి 500 రూపాయలు అదనంగాప్రభుత్వం కల్పించింది అని వరి పండించిన ఏరైతుకూడా దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రంలోమీరు అమ్ముకున్నట్ల యితే ఏలాంటి ఇబ్బందులు లేకుండా గిట్టుబాటుధర కల్పిస్తూ అదనంగా బోనస్ కూడా వస్తుందనీ రైతులకు తెలిపారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తనూర్ జయన్న, సిసి మోలాలి, ఏఈఓ శ్రీకాంత్‌రెడ్డి, వివోఏ మహేష్, గ్రామ సంఘ లీడర్లు చిన్న సంగం సభ్యురాలు గ్రామ రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాడే మోసిన అల్లంపూర్ ఎమ్మెల్యే

**ఇటిక్యాల, ఏప్రిల్21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉదండాపురం గ్రామానికి చెందిన గొల్ల వీరేష్ అకాల మరణం చెందారు. సోమవారం విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తూ గొల్ల వీరేశ్ పాడెను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మోశారు.



ఉదండాపురంలో గొల్ల వీరేష్ పాడెను మోస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## కొనసాగుతున్న సహాయక చర్యలు

◆ టన్నెల్ 2 వద్దకు చేరిన టిబిఎం బేరింగ్ ◆ 24న ప్రభుత్వానికి నివేదిక

**నాగర్ కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్21 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.ఇప్పటివరకు జరిగిన సహాయక చర్యలపై పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి శివశంకర్ ఈనెల 24న పూర్తి నివేదికతో సహాయక చర్యలపై ప్రభుత్వానికి ఒక రిపోర్టు పంపనున్నట్లు సమాచారం. ప్రత్యేక అధికారి రూపొందించిన నివేదిక ఆధారంగా సహాయక చర్యలు కొనసాగించాలా లేదా అనే విషయంపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి రానున్నట్లు తెలిసింది. సొరంగ ప్రమాద ప్రదేశంలోని డి2 ప్రాంతంలో పెద్ద పెద్ద బండ రాళ్లను తొలగిస్తూ, మట్టి తవ్వకాలు కొనసాగిస్తూ కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టిని టన్నెల్ బయటకు తరలించే ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతుంది. టిబిఎం స్టీల్ భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్లతో కత్తిరిస్తూ, స్టీల్ భాగాలనులోకో ట్రైన్ ద్వారాబయటికి తరలిస్తున్నట్లు, డీవాటరింగ్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. సహాయక బృందాల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సహాయక సిబ్బంది సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారని, వారికి అవసరమైన సహాయక సామాగ్రిని, వసతులను, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. టన్నెల్ 2 వద్దకు చేరిన టిబిఎం బేరింగ్ ఎస్ఎల్బీసీ టన్నెల్ పూర్తి చేసేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. టన్నెల్ ఇన్లెట్ వద్ద జరిగిన ప్రమాదంలో టిబిఎం మెషిన్ పూర్తిగా నిర్వీర్యం కాగా, మన్నెవారిపల్లి వద్ద ఉన్న ఔట్ టన్నెల్ వద్ద నుంచి తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కొంత కాలంగా ఆగిపోయిన పనులను పునః ప్రారంభించనున్నారు. శుక్రవారం టిబిఎం బేరింగును టన్నెల్ 2 వద్దకు తెప్పించినట్టు తెలుస్తోంది. దీంతో త్వరలోనే టన్నెల్ పూర్తి చేయనున్నారు.

## పెండింగ్‌లో ఉన్న డిఏలను, పిఆర్‌సిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి

**అలంపూర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డిఏలు, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం, అలంపూర్ పట్టణంలో స్థానిక ఎమ్మార్సీ భవనం నందు టీఎస్‌యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డి.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం 7మాత్రమే విద్యకు బడ్జెట్ కేటాయించిందని, విద్యావ్యవస్థ ఎలా బాగుపడుతుందని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పిఆర్‌సి, ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లను కాపాడుకోవాలని సూచిస్తూ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అదేవిధంగా మండల విద్యాధికారి ఆర్.అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుతూ ,స్కూల్లో పిల్లల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సూచించారు. అదేవిధంగా జిల్లా ఉపాధ్యక్షులు యు.కుమార్ నాయుడు సిపిఎస్ రద్దు చేయాలని, డిమాండ్ చేస్తూ, దాని గురించి పూర్తి వివరణ ఇచ్చారు. అదేవిధంగా ఎఫ్ డబ్ల్యు ఎఫ్ గురించి కన్వీనర్ బిసన్న చాలా చక్కగా వివరిస్తూ, ఆ స్కీమ్ లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్ నాయుడు, జిల్లా ఎఫ్ డబ్ల్యు ఎఫ్ కన్వీనర్ బిసన్న, అలంపూర్ మండల అధ్యక్షుడు రాముడు సీనియర్ నాయకులు మాబు సార్, వి.మద్దిలేటి, వెంకటరాముడు, రాజ్ కుమార్, ఎల్లా కృష్ణ, సుందర్ రాజు, ప్రసాద్, శాంసన్, జాన్సన్ ధనుంజయ, శ్రీనివాసులు, ఫరీద్ ముస్తఫ అహ్మద్, మధుసూదన్, రోజా, రంగారెడ్డి, మధు నాయుడు, లోకేష్, అదే విధంగా మహిళా ఉపాధ్యాయులు అన్నపూర్ణ,మరియమ్మ, జోష్టదేవి, అశ్విని,ప్రియదర్శిని మొదలగు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సమావేశాలను విజయవంతం చేయాలి

**ధన్వాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఏప్రిల్ 26, 27 తేదీలలో మరికల్ పట్టణ కేంద్రంలో జరుగు వ్యవసాయ కార్మిక రాష్ట్రస్థాయి సమావేశాలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ పిలుపునిచ్చారు. సోమవారం నారాయణపేట మండల పరిధిలో బైరంకొండ గ్రామ శివారులో ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడుతున్నారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నఉపాధి కూలి వేతనాలు వెంటనే విడుదలచేయాలన్నారు. పనీ ప్రదేశాలలో మంచి నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్టు, టెంటు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలి, ఉపాధి హామీ పథకం కూలీలకు రోజు కూలి రూ.600 సంవత్సరంలో 200ల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర స్థాయి సమావేశాలు సందర్భంగా 26న శనివారంమరికల్ పట్టణ కేంద్రంలో గొప్ప బహిరంగ సభ ఉంటుందన్నారు.ఈ సభలకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు తమ్మినేని వీరభద్రం, అఖిల భరత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బి. వెంకట్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తదితరులు పాల్గొననున్నారని అన్నారు. బహిరంగ సభలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనివిజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ ఉన్నారు.

## కౌలు వేలం పాట ద్వారా 39,59 వేల ఆదాయం

**అలంపూర్ ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయము నందు, ఆలయ భూములు మొత్తం 34 సర్వే నంబర్లకు 2025-27 రెండు సంవత్సరముల కాల పరి మితికి కౌలు బహిరంగ వేలమును దేవాదాయ శాఖ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, సహాయ కమీషనర్, మధనేశ్వర్ రెడ్డి, పర్యవేక్షణలో నిర్వహించబడింది. ఈ 34 సర్వే నంబర్లలో, 28 సర్వే నంబర్లకు మాత్రమే కాయిషీ దారులు గత సంవత్సరం కంటే హెచ్చు పాట పాడి ఈ భూములను కౌలుకు దక్కించుకున్నారు.ఈ 28 సర్వేనంబర్ల ద్వారా ఈ సంవత్సరం రూ.39, 59,00000 ఆదాయం వచ్చింది. మిగతా 6 సర్వే నంబర్లకు సరైన ధర రాక పోవడంతో రెండవ పర్యాయము తేదీ: 02.05.2025 శుక్ర వారము నాడు తిరిగి కౌలు బహిరంగ వేలం నిర్వహించ బడును. అదే విధంగా శ్రీ సూర్య నారాయణ స్వామి ఆలయమునకు చెందిన 2 సర్వే నంబర్లకు ఈ సంవత్సరం రూ.6,77,00000 ఆదాయం వచ్చింది. గతము 2023-25 సంవత్సరమునకు రూ.2,77,00000మాత్రమే ఆదాయంవచ్చింది. కాశీపురం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయమునకు చెందిన 2 సర్వే నంబర్లకు ఈ సంవత్సరం రూ.2,11,00000 ఆదాయం వచ్చినది. గత 2023 -25 సంవత్సరములో 1,04,00000 మాత్రమే ఆదాయం వచ్చింది. ఈ వేలం పాట నందు ఆలయ ఛైర్మెన్ బి.నాగేశ్వర్‌రెడ్డి, ఈ.ఓ. పురేందర్ కుమార్, ధర్మకర్తలు నాగ శిరోమణి, జగదీశ్వర్ గౌడ్, ఏ. వెంకటేశ్వర్లు, జగన్ మోహన్ నాయుడు, జి. వెంకటేశ్వర్లు, గోపాల్ ఆలయ సిబ్బంది, అలంపూర్ గ్రామ పెద్దలు, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పండించిన పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి

**అలంపూర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పండించిన పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్ బిఎల్ సంతోష్‌కి తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించడం అయింది సమస్యను కలెక్టర్‌కి తెలియజేస్తు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రవేట్ కంపెనీలు జిపిఐ అలయన్స్ ఐటిసి వి ఎస్టి తదితర కంపెనీలు రైతులతో నేరుగా ఒప్పందం చేసుకొని ఎక్కువ మొత్తంలో పంటను సాగు చేయించి ఇప్పుడు పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకుండా రైతులను తీవ్ర అవస్థలకు గురిచేస్తున్నారని గత నెల రోజులు కొనుగోలు ఆపివేయడంతో అకాల వర్షాల వల్ల పంట తడిసి నాణ్యత తగ్గి తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు అనేకమార్లుగా కంపెనీ వారిని కలిసిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని యజమాన్యం స్పందించడం లేదని కలెక్టర్‌కి వివరించారు. విషయంపై కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత కంపెనీ యజమాన్యంతో మాట్లాడి పొగాకు పంటను కొనుగోలు చేసే విధంగా చేస్తానని ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రేపల్లె దేవదాస్.జి.రాజు రైతు సంఘం మండల నాయకులు బి.నర్సిములు రైతులు గోవర్ధన్ ,మదిలేటి శ్రీనివాసులు ,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**చిన్నంబావి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలో తిరుమలనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి స్వగ్రామం కావడంతో వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న వారి స్వగృహం నుండి అమ్మవారికి తాళిబొట్టు, పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు కల్యాణ మహోత్సవానికి హాజరై పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యదర్శి కె.మాణికరాజ్ సూచించారు. సోమవారం నారాయణపేట పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కార్యదర్శికి కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా అదనపు కలెక్టర్లు సంచిత్ గాంగ్వర్, బేన్ షాలోమ్ పుష్ప గుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో ముఖ్యమంత్రి కార్యదర్శి భూ భారతి పోర్టల్, తాగునీటి సమస్యపై కలెక్టర్, అదనపు కలెక్టర్లతో సమీక్ష జరిపారు. భూ భారతి పోర్టల్ అమలు కోసం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూరు మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులు, సదస్సులో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల గురించి జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పైలెట్ మండలంలో రైతులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పోర్టల్‌లో నమోదు చేసి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

# జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలి

◆ సోషల్ మీడియా, ఏఐపై అవగాహన అవసరం
◆ అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు
◆ తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి




జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి

**కొల్లాపూర్, ఏప్రిల్21 ప్రభాతవార్త:** మీడియా భవిష్యత్‌కు ప్రశ్నార్థకంగా సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీనిపై త్వరలో హైదరాబాదులో జాతీయస్థాయి వర్క్ షాప్‌ను నిర్వహిస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాగర్ కర్నూలు జిల్లా సోమశిలలో రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అధ్యక్షతన జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ మూలంగా భవిష్యత్తులో మీడియా రంగంలో మ్యాన్ పవర్ లేకుండా చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కల్పితాలతో ఏఐ సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం పొంచిఉందని, దీనిపై జర్నలిస్టులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సోషల్ మీడియా విప్లవం భావ ప్రకటన స్వేచ్ఛకు మంచి వేదిక అయినప్పటికీ దానిని అడ్డుపెట్టుకొని కొన్ని శక్తులుఅలజడి సృష్టించడం సహించరానిది అన్నారు. రాజ్యాంగం భావ ప్రకటన స్వేచ్ఛ కల్పించిందే కానీ ఇతరుల స్వేచ్ఛను హరించే హక్కు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం రూపొందించిన అక్రిడిటేషన్ జీవో అప్రజాస్వామికంగా ఉందని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ జీఓను రద్దు చేస్తూ గత అక్టోబర్ మాసంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు కమిటీ వేశామని, అంతేకాకుండా ఆ కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. త్వరలో దీనికి సంబంధించిన జీవో విడుదల కాన్నుదని ఆయన స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దని, ఈ విషయమై ఎవరు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు అవుతాయని ఆయన తెలిపారు. అక్రిడిటేషన్ కమిటీలను కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం ఉద్యమాలతోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వాలు ఏవైనా జర్నలిస్టుల పక్షపాతిగా, జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 65 ఏళ్లుగా పోరాడుతున్న చరిత్ర తమ సంఘానికే ఉందని అన్నారు. సంఘ నాయకులకు ప్రభుత్వ పదవులు వచ్చినంత మాత్రాన, సంఘ ప్రయోజనాల కోసం కాదని ఆ పదవుల బాధ్యతలు వేరుగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. టీయూడబ్ల్యూజే ఐజేయు ఏ ప్రభుత్వానికి, ఏ పార్టీకి అనుకూలం కాదనీ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ)ఏ ప్రభుత్వానికి, ఏపార్టీకి అనుకూలంకాదని, జర్నలిస్టుల సంక్షేమమే ఏకైక లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ స్పష్టం చేశారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇండ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు, ఉచిత విద్య తదితర సమస్యలపై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం వినతి మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మెడికవర్ ఆసుపత్రుల్లో ఉండే ఆర్థోపెడిక్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులకు హెల్త్ కార్డులపై చికిత్స చేసేందుకు ఆసుపత్రి యాజమాన్యం నిర్ణయించడం అభినందనీయమని అన్నారు. గత కార్యవర్గ సమావేశం అనంతరం చేపట్టిన కార్యకలాపాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేరామనారాయణ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో ఐజేయూ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరిశేఖర్, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్‌గౌడ్, గాడిపల్లి మధుగౌడ్, ఫైసల్అహ్మద్,రాష్ట్ర కార్యదర్శులుగుండ్రాతి మధుగౌడ్, వరకాలయాదగిరి, కె.శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి మోతే వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన నాగర్‌కర్నూల్ జిల్లా శాఖను రాష్ట్ర కార్యవర్గం అభినందించింది. అనంతరం పలు తీర్మానాలు చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మంత్రులందరికీ యుద్ధ ప్రాతిపదికన వినతి పత్రాలు అందించాలని సమావేశం తీర్మానించింది. సంఘ సంస్థాగత కార్యకలాపాలను మరింత పటిష్టం చేయడానికి రాష్ట్ర బాధ్యులను జిల్లా ఇన్చార్జిలుగా నియమించాలని కార్యవర్గం నిర్ణయించింది. టీయూడబ్ల్యూజే (ఐజేయు)కు అనుబంధంగా ఉన్న ప్రెస్ క్లబ్‌ల కార్యకలాపాలను పరిశీలించేందుకు గాను ఆరుగురు సీనియర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని కార్యవర్గం నిర్ణయించింది. ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మాణం చేసింది.

## ఇండ్లు కోల్పోయిన బాధితులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

■ బాధితులకు నష్ట పరిహారం పెంచి ఆదుకోవాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేస్తుతున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** చారకొండ మండల కేంద్రంలో జాతీయ రహదారి 167 బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఫిబ్రవరి 4న, 29 కుటుంబాల ఇండ్లను ప్రభుత్వం జేసీబీలతో నేలమట్టం చేసింది. ఇండ్లు కోల్పోయిన పేదలకు ఇంటి స్థలం కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎంపార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చారకొండ మండల కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగింది. ఆర్డీవో గారికి కలెక్టర్ గారికి వినతి పత్రాలు అందించారు. అయినా ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో మండల కేంద్రంలో 14 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రిలే దీక్షలు చేస్తున్న శిబిరం దగ్గరికి వచ్చి మీ సమస్యలను పరిష్కరిస్తాం, ఇండ్లు నిర్మించి పేదలను ఆదుకుంటామనిహామీకూడా ఇచ్చారు. దశలవారీగా నిర్వాసితులు నిరసన కార్యక్రమాలు చేపట్టగా స్థానిక తహసిల్దార్ శిబిరం వద్దకు డీటీని పంపించి బాధితులకు ప్రభుత్వం 15 రోజులలో మీ సమస్యలను పరిష్కరిస్తాము అని హామీ ఇచ్చారు. నేటికీ రెండు నెలలు దాటిన బాధితులకు అధికారులు ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ నేటికి కూడా అమలు కాకపోవడంతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిప్రజావాణిలో చారకొండ బాధితులకు, ఇంటి స్థలం కేటాయించి, అట్టి స్థలంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అదేవిధంగా బాధితులకు పరిహారాన్ని పెంచి, పేదలను ఆదుకోవాలని కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు మధు, సిపిఎం వంగూరు,చారగొండ మండలాల కార్యదర్శి బి బాలస్వామి, నిర్వాసితుల పోరాట కమిటీ అధ్యక్షులు గ్యార రాజు, ప్రధాన కార్యదర్శి సీమాల్ల విజయ,జెల్లఅలివేల,నల్లకిరాన్, నల్లరాములమ్మ, అనసూయమ్మ, వెంకటమ్మ,జగదీశ్వర్ అమ్మ,బాలమ్మ, సుమతమ్మ, పాల్గొన్నారు.

## రైతన్నలు అధైర్య పడొద్దు అండగా మేమున్నాం

■ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి



ఈదురుగాల్లకు నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**బిజినేపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రైతన్నలూ మీరు అధైర్య పడొద్దు మీకు అండగా ప్రజా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. మంగనూరు లట్టుపల్లి గ్రామాల్లో అకాల వర్షానికి నేలకొరిగిన పంటలతో పాటు ధాన్యాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. వ్యవసాయ అధికారులు పూర్ణ చందర్‌రెడ్డి, నీతిరెడ్డితోపాటు పంటలను ధాన్యాన్ని పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేయాలని అధికారులకు సూచించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా నివేదికను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే రైతుల్లో భరోసా నింపే ప్రయత్నం చేశారు. ప్రతి ఎకరాన్ని పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా రైతు ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే వెంటామాజీ పిఎసిఎస్ ఛైర్మన్‌వెంకటస్వామి,మాజీ జెడ్పిటిసి పరశురాములు, మాజీ సర్పంచులు అమృత్ రెడ్డి, తిరుపతయ్య, రామ్‌రెడ్డి, బాలరాజు మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మల్లికార్జున్, గోవింద్ నాయక్, వాళ్యనాయక్, నసీర్, కత్తె ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్ గౌడ్, పాషా జాలం కృష్ణయ్య, నాగయ్య, కటిక శ్రీను తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రైతులు పండించిన పంటలను విక్రయించుకునేందుకు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట మండలం ఆవంచ, బుద్ధసముద్రం గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజనూ కొంటామని రైతులు మోసపూరిత మాటలు నమ్మవద్దని తెలిపారు. సన్నరకం వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని,రైతులకు ఏఇబ్బంది ఉన్నాతన దృష్టికి తీసుకు రావాలన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ప్రధానోపాధ్యాయుడి మృతి

**వెల్దండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తూ ఈ నెలలోనే పదవి విరమణ పొంది తన కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాల్సిన సమయంలోనే విధి వక్రీకరించి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... తెల్కపల్లిలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న పాపిశెట్టి శ్రీనివాసులు ఎప్పటి లాగానే హైదరాబాదులోని తన నివాసం ఉంటున్న మన్నెగూడ నుండి సోమవారం ఉదయం తన సొంత కారులో బయలుదేరి వస్తుండగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద కుక్కలను తప్పించబోయి అతివేగంగాకారు ఉండడంతో కారు కల్వర్ట్‌ను ఢీకొట్టడంతో శ్రీనివాసులు తీవ్ర గాయాల పాలయ్యారు. పక్కనే ఉన్న పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది గమనించి 108కు సమాచారం అందించగా 108వాహనంలో క్షతగాత్రుని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసులు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు శ్రీనివాసులు సొంత గ్రామం అచ్చంపేట ఈ నెలలోనే పదవి విరమణ పొంది కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాల్సిన సమయంలో అనంత లోకాలకు వెళ్లారు. మృతుని భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుకున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వేసవి సెలవులు ఉన్నందున శ్రీనివాసులుకు పదవి విరమణ సభను ఈ నెల 17న పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు.మృతితో సొంత గ్రామంతో పాటు పాఠశాలలు విషాదఛాయలు అలుముకున్నాయి.

## ప్రజల మన్ననలు పొందాలి

హోంగార్డుల సంక్షేమానికి కృషి : మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** హోంగార్డుల సంక్షేమానికి పోలీసు శాఖ కృషి చేస్తుందని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి వెల్లడించారు. జిల్లా ఎస్పీ డి జానకి హోమ్ గార్డ్స్ అధికారులను ఉద్దేశించి, "క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందే విధంగా ప్రవర్తించాలి" అని సూచించారు. నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట జిల్లాల నుండి రొటేషన్ పద్ధతిలో మహబూబ్ నగర్ జిల్లాకు కేటాయించబడిన 110 మంది హోమ్ గార్డ్స్ అధికారులతో జిల్లా పోలీస్ కవాతు మైదానంలో సోమవారంసమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో విధులు నిర్వహించేందుకు వచ్చిన హోమ్ గార్డుల సంక్షేమం కోసం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని పేర్కొన్నారు.విధుల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే సంబంధితఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించబడతాయని హామీ ఇచ్చారు.సిబ్బంది క్రమశిక్షణ పాటిస్తూ, ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని, రోజువారి విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను గౌరవిస్తూ ముందుకు సాగాలని సూచించారు. హోమ్ గార్డ్స్‌ను ఎంటి సెక్షన్, జనరల్ డ్యూటీ,బ్లూకోల్ట్స్,ట్రాఫిక్, తపాల్ వంటి విభాగాల్లో నియమించనున్నట్టు తెలిపారు. వారు కేటాయించబడిన విభాగాల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం ద్వారా మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ విభాగానికి మంచి పేరు తీసుకురావాలి" అని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు కృష్ణయ్య, నాగేశ్, రవి ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉన్నత విద్యతోనే సమాజంలో గుర్తింపు




సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్న పాఠశాల విద్యార్థులు

**బిజినేపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** విద్యార్థులు చిన్నప్పటినుంచి ఉన్నత విద్యాభ్యాసంతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని ఎంఈఓరఘునాథ శర్మ అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం మాస్టర్ మైండ్ హైస్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే లక్ష్యం నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు. విద్యతోపాటు క్రీడలు, సామాజిక స్పృహ, పెద్దలపట్ల గౌరవం, ఉత్తమ మానవ సంబంధాలు కొనసాగిస్తే సమాజంలో మనగడ సాధ్యమవుతుందని తెలిపారు. ఎప్పటికప్పుడు సమాజ పోకడలను తెలుసుకొని విద్యార్థిదశలోనే క్రమశిక్షణతో మెలిగితే ఉత్తమ పౌరుడిగా సంతోషకరమైన జీవితాన్ని సాగించవచ్చని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను అతిథులను అలరించాయి. కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ భాను ప్రకాష్ రెడ్డి, సత్తార్, వహీద్, బాలాజీ తదితరులు ఉన్నారు.

## చికెన్ వ్యర్థాల సేకరణకు టెండర్

**పెబ్బేరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో చికెన్ వ్యర్థాల సేకరణకు నిర్వహించిన వేలం పాటలో ఆంజనేయులు కు అత్యధికంగా 3,9500 వేలం పాట పాడి టెండర్ దక్కించుకున్నారు. టెండర్ తగ్గించుకున్న వారు ఒక సంవత్సరం పాటు చికెన్ మటన్ చాపలు వ్యర్తాలను సేకరించాల్సి ఉంటుంది. టెండర్లు 8 మంది పాల్గొనగా పెబ్బేర్ పట్టణానికి చెందిన ఆంజనేయులుకు టెండర్ కార్డు దక్కించుకున్నారు అని మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి తెలియజేశారు.

## మీడియా అకాడమీ ఛైర్మన్‌ను కలిసిన ఐజేయు నాయకులు



మీడియా అకాడమీ ఛైర్మన్‌తో మహబూబ్‌నగర్ జిల్లా యూనియన్ నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా టియుడబ్ల్యూజే (ఐజేయు) నేతలు సోమవారం కలిశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం సోమశిల వద్ద నిర్వహించిన టియుడబ్ల్యుజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, ఐజేయు జాతీయ కార్యదర్శి దేవులపల్లి అమర్‌తో పాటు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్లు హాజరయ్యారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా యూనియన్ నాయకులు ప్రెస్‌క్లబ్ అంశాలు, యూనియన్ సభ్యత్వాలు మీడియా అకాడమీ చైర్మన్‌తో చర్చించారు.

## జిల్లా స్థాయిలో కొల్లూరు విద్యార్థుల ప్రతిభ

**నవాబుపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** జిల్లా స్థాయి మహబూబ్‌నగర్ కేంద్రంలో నేషనల్ ఇన్నోవేషన్ క్యాంపెయిన్ మ్యాస్ అండ్ సెన్స్ క్విజ్‌లో మండల పరిధిలోని కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో మొదటి బహుమతులను సాధించారు. మ్యాస్ అండ్ సైన్స్ క్విజ్‌లో ఎనిమిదవ తరగతి విభాగంలో ఎం.లిఖిత జిల్లా స్థాయిలో మొదటిబహుమతి పొందగా,ఏడవ తరగతి విభాగంలో కె.శ్రుతి జిల్లా స్థాయి ఫస్ట్ బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కొల్లూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామస్తులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు.

## మహబూబ్‌నగర్ కలెక్టర్‌కు వినతి

**మహబూబ్‌నగర్, ఏప్రిల్21 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలోని మత్స్యకారుల అభివృద్ధి కై చెరువుల మరమ్మత్తు, చెరువుల కుంటల రక్షణ పెండింగ్‌లో ఉన్న ఎఫ్‌సిఎస్ సంఘాల రిజిస్ట్రేషన్ డిఎఫ్‌సిఎస్/ఎఫ్‌సిఎస్‌లకు నిర్ణీత కాలంలో ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ మహబూబ్ నగర్ జిల్లా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయికి వినతి పత్రం సమర్పించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా లోని చెరువుల కుంటలలో చేపల వేట, విక్రయము పై ఆధార పడి జీవించే మత్స్యకారుల జీవనోపాధికి, చేపల పెంపకము, మార్కెటింగ్ అంశాల పరిష్కారానికై మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్‌కు ముదిరాజ్ మహాసభ ఆద్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## మక్తల్ ఎమ్మెల్యేను కలిసిన పోతురాజు సోమనాద్రి

**ఇటిక్యాల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండేరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు పోతురాజు సోమనాద్రి సోమవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఇంటింటి ప్రచారం

**వెల్దండ, ఏప్రిల్21 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రజలందరూ రాబోయే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ విద్యార్థులను చేర్పించాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రవీందర్ అన్నారు. సోమవారం తమ ఉపాధ్యాయ బృందంతో కలిసి దుబ్బతాండ, పోచమ్మ గడ్డ తండా,రావిచెట్టు బండ తండా, ఉప్పల గట్టు తాండ, మల్లయ్య గుండు తాండలోని విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఆధునిక సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని, మన ఊరి బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అవగాహన కల్పించారు. నేటి ఈ బడిబాట సందర్భంగా వివిధ గ్రామాల నుండి పదిమంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికిరణ్, కమలేకర్ నాగేశ్వర్‌రావు, రేణుక, జ్యోత్స్న,చంద్రశేఖర్,పత్యా, సాజిదాబేగం,దానయ్య,జాను, మమత పాల్గొన్నారు.